# అధికారం

వేసవికాలం. మేనెల. మా వూరిలో వుదయం తొమ్మిదైందగ్గిర్నించీ పెనం మీదవేచినట్టు యెండ వేడియెక్కుతుంది. నాకు యేమీ పనిలేదు. పెద్దలుంచిన ఆస్తి అనుభవించడం, రోజులో చాలాభాగం మా వూరి క్లబ్బులో నాలాటివాళ్ళతో ఇండోరు, అవుటుడోరు, గేమ్సుతో కాలం వెళ్ళబుచ్చడం నాపని. వొకరోజు వుదయం స్నానం, కాఫీ, వగైరాలన్నీ ముగించి క్లబ్బుకిబయల్దేరుతూవుంటే టపావొచ్చింది. అందులో వొకవరు చింపి చూసేను. నా స్నేహితుడు వొక పోలీసు అసిస్టెంటు సూపరింటెండెంటు, సముద్రపొడ్డున వున్న వొక బంగళాలో వారంరోజు లుంటాననీ నన్నురమ్మనీ రాసేడు. సరేననుకుని ప్రయాణానికి సిద్ధమయేను. వొచిన్న సూటుకేసూ, బెడ్డింగూ రెడీ చేసేరు.

అతడున్న స్థలానికివెళ్లాలంటే మావూరిలో వుదయం తొమ్మిదిగంటలకి బస్సెక్కాలి. అది యిరవై మైళ్ళదూరంలో వున్న రంగపురానికి సుమారు పదకొండున్నరకి వెళ్తుంది. అక్కణ్ణించి యేటిపంతెన దాటి సుమారు మైలుదూరం వెళ్ళి అక్కడ మరోబస్సు యెక్కాలి. అది మధ్యాహ్నం రెండుగంటలకి బయలుదేరి నేను వెళ్ళవలసిన వూరికి వొ గంటన్నరలో వెళ్తుంది. బస్సుదగ్గిరకి పబ్లిక్ వర్క్సు ఇన్స్పెక్టర్ని పంపిస్తానని నా స్నేహితుడు రాసేడు. రంగపురంలో మధ్యాహ్నం టైముంటుంది. భోజనం చెయ్యవచ్చును. నేను బస్సుస్టాండుకి వెళ్లేను. కండక్టరు తెలిసినవాడు. ఫ్రంటుసీటులో కూర్చోబెట్టి నా సామాన్లు వెనకసీటులో సర్దించేడు. అప్పటికి తొమ్మిదిన్నరైంది. బస్సు బయల్దేరేసరికి వొక డవాలీబంట్రోతు వొచ్చి 'తాసీల్దారుగారు బయల్దేరుతున్నారు. ఇంటికి బస్సు తెమ్మన్నార'న్నాడు. అలాగే సందులన్నీ దాటి బస్సువాళ్లింటిముందు ఆపేరు. అప్పటికి యెండ యెక్కువవుతున్నాది. కండక్టరు వెళ్ళి ప్యూనుతో చెప్పేడు. 'అయ్యగారు స్నానానికెళ్ళేరు. అదైంతరవాత భోంచేసి, బయల్దేరుతారు' అని ప్యూను చెప్పి, క్లీనర్ని తీసుకుని వెళ్ళి, క్యాంపు సామాన్లన్నీ బయట పెట్టించి, గుమాస్తాగార్ని పిలవడానికెళ్లేడు. డ్రైవరు 'చచ్చాన్రా దేవుడా! యీబస్సు స్టార్టవడానికి కల్లరపెడుతుంది. ముందుకి తొయ్యడానికి వీల్లేదు. వెనక్కితోస్తే కదుల్తుందో లేదో' అంటున్నాడు. సుమారు పదకొండు గంటలకి గుమాస్తాగారొచ్చి లోపలికెళ్ళి ఆఫీసరుగారి నాహ్వానించేరు. తాసీల్దారుగారొచ్చి నా పక్కనే కూచున్నారు. సామాన్లు టాపుమీద వేయించి ట్రూపంతా బస్సెక్కింతరవాత బయల్దేరమని ఆర్డరిచ్చేరు. ఎన్ని తంటాలుపడ్డా బస్సు స్టార్టు కాదు. బస్సు వెనక్కి తొయ్యగా వొ అరగంటకి స్టార్టయింది. ఆఫీసరుగారి కోపంవొచ్చి 'ఎవ్రడ్రా యీ బస్సువోనరూ? ఈలాంటి బోకువెధవ బస్సుపెట్టి, పబ్లికుదగ్గిర డబ్బు

**పి. జి. స్వామి**


లాగి (తను మహాబస్సు ఫేరిచ్చినవాడిలాగ), యిన్సల్టు యిన్యాన్నీ చేస్తున్నాడూ' అని గర్జించేరు 'చిత్తం, చిత్తం! బేటరీ అవుటైపోయింది చార్జీ చేయించాలి సార్' అని డ్రైవరు చెప్పేడు. బయల్దేరి బస్సు పన్నెండుమైళ్ళు వెళ్లింతరవాత వ్యానొకకేకేసి బస్సు నిలపమన్నాడు. అక్కడ యెదురుగావున్న వొకబండీ తోవలోకి బస్సు తిప్పమన్నాడు. నాకు గుండె జారిపోయింది. తాసీల్దారుగారితో 'అయ్యా! యెండ దంచేస్తున్నాది. పిల్లలూ, ఆడవాళ్లూ వున్నారు ఇప్పటికే చాలాలేటయింది. అదీగాక నేను రెండో బస్సు కెళ్లాలి'అని చెప్పేను. ఆయన 'అదుగో. ఆయెదురుగావున్న వూళ్లో యీవాళ పంచాయితీకోర్టుయలక్షన్లు కండక్టు చెయ్యకతీరదు' అని జవాబిచ్చేరు. ఈలోగా బస్సులోంచి కాంగ్రెసు డ్రెస్సు ధరించి వున్న, వొక ఆసామీ 'బస్సు తిన్నగా రంగపురం నడిపిస్తారా, లేదా? పబ్లిక బస్సులు స్వంత బళ్ళలాగ వుపయోగించడం యింకా కట్టలేదు. యీ సంగతి మాటు మినిస్టరు చెవినెయ్యాలి' అని హుంకరించేడు. దాంతో యేమాలోచించేరో ఆఫీసరుగారు. 'తన సామానులన్నీ దింపించి, వూళ్ళోకి వెళ్ళి వొక బండీ తెమ్మని ప్యూనుని పంపించి, తానూ, క్లార్కూ దిగిపోయేరు. మా బస్సు రంగపురం చేరేసరికి సుమారు వొంటి గంటన్నరైంది. హోటేళ్లలో భోజనం లేదన్నారు. దాహం ఎక్కువగా వుంటే రెండు కొబ్బరిగాయల నీళ్లుతాగితే ప్రాణం కొంచం బచాయించింది. కూలీ నెత్తిమీద సామాను పెట్టి బ్రిడ్జీ దాటి రెండో బస్సుకి మండుతున్న యెండలో ఆతృతగా నడిచి వెళ్లేను రోడ్డుమీద బస్సువుంది బతుకు జీవుడా అనుకుని కూలివాడికి డబులిచ్చి పంపేసేను.

ఆ బస్సులో యెలకల్లాగ మాడిపోతున్న ప్యాసెంజర్లు తప్ప, కనుచూపు దూరంలో, బస్సుకి సంబంధించిన వాళ్లు గాని, మరి యే యితరమానవులు గాని కనుపించలేదు. రోడ్డుకి యిటూ, అటూ యేటియిసక దిబ్బలు కాలి వేడి గాడ్పులొస్తున్నాయి. నేను ముందు సీటు దగ్గిర కెళ్ళి చూస్తే వొక కాకీసంచీ


## నపుంసక తైలం

అంగనరములు బలహీనతచెంది చిన్నదైన తిరిగి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లుప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు. 1 సీసా రూ 10/-లు.
వి. పి రూ 1-4-0
కావలసినవారు రు. 1/4 ముందుగా పంపేది.
డా॥ రత్నం సన్సు మెడికల్ హాల్,
మలకపేటబిల్డింగ్స్, హైద్రాబాదు-(దక్కన్)

## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహ, ను, నిర్వీక, నిస్సత్తువ, శుక్ల క్షయమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—
20 తు॥ ఢబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.
పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పిరిగెడ్డ- నెల్లూరు జిల్లా.

# ★ అధికారం ★

వుంది. దాన్ని డ్రైవరు సీటువేపు పెట్టి వొడ్డుకి కూచున్నాను. ఆకలి దహించేస్తున్నాది. అసలే నా దేహచ్ఛాయ నలుపు. నేను, పంచకట్టుకుని, కాలరులేని చొక్కా తొడుక్కుని, వో తువాలు బుజంమీద వేసుకున్నాను. అదివరకు బస్సు ప్రయాణం ధూళి బట్టలనీ, వొంటినీ ఆశ్రయించుకుని వుంది. నడకవల్ల పట్టిన చెమట, గాడ్పువల్ల ఆరిపోయి, ధూళి అంటుకుని చారికల్లాగ వుంది. మొత్తానికి డర్టీగా వున్నాను. కొంత డరీగా వున్నా వొక హాఫ్ పేంటూ, బుష్షర్టూ, హేటూ ధరిస్తే ఆ దర్జా వేరూ.

యెంత వేగం గమ్యస్థానం చేరి, స్నానంచేసి శుభ్రమైన బట్టలు వేసుకుంటానా అని వున్నాను. రెండున్నర గంటలైంది. యెవరూ రాలేదు. సుమారు మూడుగంటలకి క్లీనరు వొచ్చేడు. అతణ్ణడిగితే, నా వేపు తీవ్రంగా చూసి, అతి నిర్లక్ష్యంగా 'కండక్టరూ, డ్రైవేరూ టీ తాగొత్తారు' అన్నాడు. తనో బీడీ ముట్టించి, డ్రైవరు సీటులో కూచుని, 'బస్సు పుటెంగొరబాబూ, బస్సు పుటేంది బస్సు పుటే, బల్లవాల్లక్కడుపు పెటేంది,' అనీ, యింకో యేదో హింది, తెలుగూ మేళాయించి




సినీమా పాటలూ పాడుకుంటూ చిదానందంలో మునిగివున్నాడు. మూడున్నరకి కండక్టరూ, డ్రైవరూ వొచ్చి బీడీలు కాలుస్తూ బస్సు నీడని నిల్చున్నారు. 'ఏమండీ! యీ బస్సు యెన్నిగంటలకి బయల్దేరాలండీ' అని నే నడిగేను. 'నీకెందుకయ్యా ఆ వివరాలూ? మా యిష్టం వొచ్చినప్పుడు బయల్దేరుతుంది' అని కండక్టరు జవాబిచ్చేడు. డ్రైవరు 'వొరే సిరపా! యింజను తుడిచేవా? ఆయిలూ, పెట్రోలూ వేసేవా' అని అడిగితే 'అన్నీ రైటు' అన్నాడు క్లీనరు. కొంతసేపు బీడీకాల్చి, అది పారవేసి డ్రైవరు తన గద్దెయెక్కి విష్ణుచక్రంలాగ స్టీరింగు పట్టుకుని హేండిలు కొట్టమని క్లీనరుకి ఆర్డరిచ్చేడు. క్లీనరు హేండిలు పట్టుకుని బస్సుముందుకెళ్ళి 'యెయ్యో కండక్టరూ! కనిస్టీపిగోరు రాలేదు.' అన్నాడు. డ్రైవరు 'టీ తాగొత్తానన్నాడు. కొట్రా. బస్సు టాటు సేద్దామూ' అన్నాడు. క్లీనరు హేండిలు తిప్పీ, తిప్పీ, ప్రాణం విసికి 'డ్రైవేరూ! బెల్పుటాటుకొట్టూ. కారిబెట్టు సూసినావా?' అనడిగేడు. డ్రైవరు అవీ యివీ నొక్కి మళ్లా కొట్టమన్నాడు. అలా చేస్తే బస్సుకి చలనం పుట్టింది. క్లీనరు హేండిలు నా కాళ్లమీదనించి లోపలికి విసిరి, వూరు వేపుచూసి, 'కనీస్టీపిగో రొత్తున్నారని' కేకేసేడు. మరైదునిమిషాలకి వొకాయన కాకీ నిక్కరూ, తెల్లషర్టూ తొడుక్కుని, పోలీసుసప్లై ఆకు చెప్పులు వేసుకుని, సిగరెట్టు కాలుస్తూ ఫ్రంటుసీటు దగ్గిరకొచ్చి నా వేపు వోమాటు యెగాదిగా చూసేడు. బస్సు ఫుట్టుబోర్డుమీద కాలు పెట్టి ఆ కాకీమూటవేపు చూపెడుతూ 'ఆ మూట యిక్కణ్ణించి అక్కడి కెలాగ వెళ్లింది?' అన్నాడు. నేను మాటాడలేదు. మళ్ళా అతి శివిగా 'యెలాగ వెళ్లిందీ అంటా' అన్నాడు. అప్పుడు నేను 'దానంతటది వెళ్లలేదూ. నేను యిక్కణ్ణించితీసి అక్కడ పెట్టేను' అన్నాను. అతడు అతిగంభీరంగా 'అది గౌరమెంటు పోపర్టీ అని తెలీదూ?' అనడిగేడు. 'దాని మీదలాటి వ్రాత యేమీ లేదు. యేమైనా నేను దాన్ని యేమిచెయ్యలేదు. కొంచం అటువేపుజరిపి యిక్కడ కూచున్నాను' అని చెప్పేను. 'హక్కులేంది దాన్ని ముట్టుకోడం వో నేరం. పీనలుకోడుప్రకారం ప్రాసిక్యూషను చెయ్యొచ్చు' అని అతడన్నాడు. నాకు ప్రాణం విసుకెత్తి 'అయిందేదో అయిందీ. మీమూటకేమీ డామేజీ కలగలేదయ్యా. మీరు దయచేసి బస్సు యెక్కండీ యిప్పటికే చాలా లేటయిం

దన్నాను. అతడికి మరీ కోపం వొచ్చి 'లేటవుతే అవుతుంది. అదంతా నీ కెందుకూ? గౌరమెంటుడ్యూటీ, అందులోనూ పోలీసు డ్యూటీ అంటే బస్సు కాదు, రెయిలయినా ఆగితీరాలి' అని గర్జించేడు. బస్సులోంచి వొక ఆసామీ 'కనిష్టీపుగోరూ! తెలిక మాలోటోళ్ళం తప్పులు సేస్తాం. తమలాటి ఆపీసర్లు సూసి సూన్నట్టూరుకోవాలి. చెమించాలి' అన్నాడు. మరొకడు 'ఆయన మాట ముట్టుకుంటే కోపం రాదటయ్యా?' అన్నాడు. కండక్టరుకూడా ఆయన్ని బతిమాలితే ఆ కానిస్టేబిలు నా వేపు వొక అధికారపూరితమైన చూపు విసిరి, దర్జాగా వొచ్చి డ్రైవరు పక్కని కూచున్నాడు. తరవాత బస్సులోని జనం యెవరికి తోచినట్టూ వారు యీ యిన్సిడెంటుగురించి అనేకవిధాలుగా చర్చ సాగించి తుదకు నేను యెంత కఠినశిక్షయినా డిజర్వయేటంత తప్పు చేసినట్టూ, కనిష్టీపిగారు మిక్కిలి దయగలవారు కాబట్టి నన్ను క్షమించి విడిచిపెట్టేసినట్టూ మెజారిటీ నిర్ణయించేరు. అతడుకూడా మధ్యమధ్య వొక రిమార్కు పాసుచేస్తూ తన ఆధిక్యతా, పవరూ ప్రకటించీవాడు.

రోడ్డంతా గోతులతో నిండి వుంది. అందుచేత బస్సు స్పీడు గంటకి పది మైళ్ళకంటె యెక్కువ లేదు. కుదుపు యెక్కువగా వుంది. నాకు వొళ్ళంతా నొప్పిగా వుంటే, కళ్ళు మూసుకుని, తల రెండు చేతుల్లోనూ పట్టుకుని కూచున్నాను. నాలుగైదు మైళ్ళు వెళ్ళి వుంటాము. బస్సు మెల్లిగా నడవడం ఆరంభించింది. నేను కళ్ళువిప్పి చూసేసరికి నా పక్కనున్న కానిస్టేబిలు తన మూటవిప్పి టోపీ తీస్తున్నాడు. బస్సు ఆగింది. అతడు యెలాగు గెంతేడో వొక్క దాటుతో రోడ్డుమీద వున్నాడు. ఎటెన్షనులో నిలబడి యెదురుగా వొస్తున్న పోలీసుసర్కిలినస్పెక్టరుకి వొక సాల్యూటు చేసేడు. అతడు నిండు డ్రెస్సులో వున్నాడు. కనిష్టీపిగార్ని చూడగానే 'యిడియట్! ఆ డ్రెస్సేమిట్రా. బికారి వెధవలాగ? టోపీమీద నంబరు లేదేమీ? యెక్కడికి వెళ్తున్నావూ?' అని వొక్క కేక వేసేడు. 'చిత్తం. బీటుడ్యూటీ మీద ఆడవరాని కెళ్తున్నానుసార్' అని జవాబిచ్చేడు కనిస్టీబు 'నీకెక్కడిది?' '.....' 'బస్సుమీద దయచేస్తున్నారేమిటీ? దొరగారూ. ఎయ్ కండక్టర్ వీడి మూట యివతల విసిరెయ్' అని యినస్పెక్టరుగారన్నారు. కండక్టరు ఆ మూట తీసియిస్తూ వుంటే చూసి ఆయన 'అబ్బో! దొరగారికి ఫ్రంటుసీటు కూడానా' అంటూ నన్ను చూసి 'బాబూ మీ రెక్కడికి' అని అడిగేరు నేను చెప్పేను. అప్పుడు కానిస్టేబిల్ని చూసి 'ఓరీ యిడియట్! ఆయన పక్కనే కూచున్నావూ?' అని తిట్టి, అతడి దగ్గర డబ్బు వసూలు చెయ్యమని కండక్టరుతో యినస్పెక్టరుగారు చెప్పి 'బీటుకి నడిచి వెళ్ళడం మానీసి బస్సెక్కటోయ్ ఆఫీసరు గారికి' అంటూ వొచ్చి నా పక్కని కూచున్నారు. బస్సు నడుస్తూ వుండగా వెనకనించి 'యెవరితో మాట్టాడుతున్నాడో సూసేవొద్దా? యిట్టం వొచ్చినటూ మాటాడినాడోయ్. మా గొప్పోడినాగ? ఆ మాగా జోల్లకున్నాము.' అనీ 'యేటి తెలుస్తాది' 'తెలకపోతే నాను సెప్తున్నానుగానూ అయిందేదో అయిందీ వొళ్ళకో బాబూ అంటే వొగ్గినాడా? యెంత బాబునేనినాడూ మాగొప్పోడీసర్నాగా' అన్న మాటలు వినిపించేయి. సర్కిలుగారు మధ్య దారిలో దిగిపోయేరు. నేను గమ్యస్థానం చేరేసరికి అయిదుగంటలైంది. సబినస్పెక్టరుగారొచ్చి, నా సామాను దింపించి, బస్సు లేటుగా వొచ్చినందుకు కండక్టరుమీదా, డ్రైవరుమీదా చార్జిపెడతామని బెదిరించితే వాళ్ళు తగినట్టూ బతిమాలుకున్నారు. నేను స్టేషనుకి వెళ్ళి, స్నానం చేసి, శుభ్రమైన దుస్తులు వేసుకుని, టిఫిను ముగించేసరికి, నా ఫ్రెండుకూడా యేదో విలేజీ విజిటు చేసి వొచ్చేడు. ఇద్దరం కలిసి బంగళా కెళ్ళేం.

అక్కడ వుండగా మూడో నాడో, నాలుగో నాడో, సాయంకాలం బంగళా వరండాలో కూచుని, నా స్నేహితుడూ నేనూ టీ తాగుతున్నాం. సర్కిలినస్పెక్టరు గారు దూరంగా వొక కుర్చీమీద కూచున్నారు. సబినస్పెక్టరు గారు దూరంగా యెటెన్షనుగా నిలబడి మా వేపు చూస్తున్నారు. ఆ సమయంలో వొక కానిస్టేబిలు యెక్స్ప్రెస్ కవరు పట్టుకుని సర్కిలినస్పెక్టరుగారి దగ్గరికి వెళ్ళి సాల్యూటు చేసి కవరిచ్చేడు. దాని యెడ్రసు చూసి 'అలా తిరిగి వెళ్ళి దొరగారి చేతికియ్యి' అని ఆయన చెప్పేడు. తిరిగొచ్చి కొంచెం దూరంలో అతడు నా వేపు అతి దీనంగానూ, భయంగానూ, చూస్తూ నిలబడిపోయేడు. నేను చూద్దునుగదా అతడు బస్సులోని 'కనిష్టీపి' గారే. నా స్నేహితుడు తలెత్తిచూసి 'యేమ్రా నువ్వా?' అంటే గడగడ వొణుకుతూ అక్కడే యెటెన్షనై వొక సాల్యూటు చేసి, నన్ను చూస్తూ, మెల్లగా అడుగులు వేసుకుంటూ వొచ్చి ఆ కవరు దొరగారి టేబిలు మీద పెట్టేడు. మరో సాల్యూటు చేసి నా వేపే చూస్తూ వెళ్ళేడు. సర్కిలుగారు నా వేపు చూసి చిరునవ్వు నవ్వుతున్నారు.

★


దువ్వెనలోని నాలుగుకన్నా, తలపై రెండు కేశాలు మేలు.

కేశవర్ధని



కేశములు రాలుట నిలుపండి. వ్యాధి ప్రసవము వల్ల, క్షీణించిన జీవ తైలాలకుబదులు, కేశవర్ధనితో మీ కేశములనుపోషించండి తలలోగురుదను, చుండును అరికట్టి. అకాలంలో నెరియుటను మాన్పించండి.



కేశవర్ధనితో కేశములు పునర్జీవం పొందనివ్వండి. సువాసనకు, శుభ్రతకు షాంపూ వాడండి.

కేశవర్ధని అ. 14: షాంపూ అ. 14 పోస్టేజి అదనం. అన్నిచోట్లా లభించును.

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు.

NO 1.